సాక్షి అనంతపురం

శనివారం । 18 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికిందని అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.9°/20.7°

జిల్లా అంతటా శుక్రవారం. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్ల వర్షం పడింది.

టీచర్స్ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీదే

- ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి ఎన్నిక
- రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంవీ రామచంద్రారెడ్డి విజయం సాధించారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మధ్య నడిచింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. 169 ఓట్లతో రామచంద్రారెడ్డి గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రకటించారు.

రౌండు రౌండులో ఉత్కంఠ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతి రౌండులోనూ ఉత్కంఠ కొనసాగింది. 25 వేల పైచిలుకు ఓట్లు పోలవగా.. ఇద్దరు అభ్యర్థులకు మాత్రమే 10 వేల మార్కు దాటింది. మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో పది మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. చివరకు ఎంవీ రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మిగిలారు. వాస్తవానికి పోలైన ఓట్లలో 50 శాతం సాధించిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. కానీ రెండో ప్రాధాన్యతలో కూడా ఎవరూ 50 శాతం ఓట్లు సాధించలేదు. ఈ దశలో నిబంధనల ప్రకారం విజేతను ప్రకటించవచ్చు. ఇందులో భాగంగానే 169 ఓట్ల ఆధిక్యత ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిని విజేతగా నిర్ణయించారు.



టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నికైన రామచంద్రారెడ్డిని ఊరేగిస్తున్న అభిమానులు

ఆసక్తిరేపిన ఎలిమినేషన్

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎలిమినేషన్ అందరిలోనూ ఆసక్తి రేపింది. రామచంద్రారెడ్డి, ఒంటేరు మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొనడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వస్తాయో, ఎవరిని విజయం వరిస్తుందోనని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూశారు. ముఖ్యంగా మూడోస్థానంలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని ఎలిమినేట్ చేసే క్రమంలో ఆయన బ్యాలెట్లలోని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగతా ఇద్దరు అభ్యర్థులకు కేటాయించే సమయంలో విజయం దోబూచులాడింది. ఈ ఓట్లలో ఎక్కువ శాతం ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వెళ్లడంతో ఆయన విజయం ఖాయమనుకున్నారు. కానీ చివరకు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక చూస్తే రామచంద్రారెడ్డికే ఆధిక్యత లభించింది. దీంతో ఆయన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ ప్రకటనతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో విజయోత్సాహం నెలకొంది. అనంతరం రామచంద్రారెడ్డికి డిక్లరేషన్ పత్రాన్ని ఆర్‌ఓ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అందజేశారు.

'తొలి ప్రాధాన్యత'లో అభ్యర్థుల వారీ ఓట్లు

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	6,853
కత్తి నరసింహారెడ్డి	4,162
అనిల్ ప్రసాద్‌రెడ్డి	3,212
జీవీ నారాయణరెడ్డి	1,345
ఎంవీ రామచంద్రారెడ్డి	8,846
అనిల్‌కుమార్‌రెడ్డి	186
ఎస్.మాధవరావు	354
రామశేషయ్య	187

(మిగతా నలుగురికి ఒక్కొక్కరికి 100 ఓట్లకంటే తక్కువగానే వచ్చాయి)

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితమిలా..

మొత్తం పోలైనవి	25,272
చెల్లని ఓట్లు	3,867
ఎంవీ రామచంద్రారెడ్డి	10,787
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	10,618
మెజారిటీ	169

సీఎం ఆశీస్సులతోనే విజయం

- పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి



కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా డిక్లరేషన్ అందుకుంటున్న టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని ఎం.వి. రామచంద్రారెడ్డి తెలిపారు. తన గెలుపునకు సహకరించిన వైఎస్సార్‌సీపీ పెద్దలు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లు శుక్రవారం జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్ చేతుల మీదుగా ఆయన డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. విద్యా సంస్కరణలు అమలు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేశారని, ఇలాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరని కొనియాడారు. గతంలో ఎమ్మెల్సీలుగా ఉన్నవారు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారన్నారు. తాను వారిలా కాకుండా ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

న్యూస్‌రీల్

ముందస్తు వ్యూహంతోనే కేంద్రంలోకి వచ్చారు

- టీడీపీ నేతలపై చర్యలు తీసుకోండి
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర రెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం : తమ పార్టీ నేతలను, ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేయడానికి కొంతమంది టీడీపీ నాయకులు ముందస్తు వ్యూహంతోనే కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. అంతమంది నాయకులు అక్కడకు వచ్చి తమ ఏజెంట్లను భయాందోళనకు గురిచేస్తున్నారని, వారిని తక్షణమే బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి జేఎన్‌టీయూ కళాశాల వద్ద విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ పోటీలో ఉన్న తమ అభ్యర్థి డిమాండ్ మేరకు విచారణ చేపట్టాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకరిద్దరు అధికారులు కౌంటింగ్ తీరును తప్పుదారి పట్టిస్తున్నారని, వారిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. తమ పార్టీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు టీడీపీ అభ్యర్థి ఖాతాలోకి వెళ్లడం దారుణమన్నారు. కౌంటింగ్ కేంద్రంలో జరుగుతున్న తీరుపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.1.5 కోట్లకు తలనీలాల టెండర్



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో తలనీలాల టెండర్ ద్వారా రూ.1.57 కోట్లు పలికింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ఆలయంలో చేపట్టే వివిధ రకాల పనులకు శుక్రవారం ఆలయంలో షీల్డ్ టెండర్, ఈ- టెండర్, బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈఓ దొద్ద వెంకటేశ్వరరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెండర్లలో ప్రకాశం జిల్లా యాదగిరి ఇండియన్ హెయిర్ ఎంటర్ ప్రైజెస్ వారు బహిరంగ వేలం ద్వారా రూ.1,57,50,000కు తలనీలాల టెండర్‌ను దక్కించుకున్నారు. టెండర్ల నిర్వహణ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 888 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లిష్ పరీక్షకు 888 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99 కేంద్రాల్లో పరీక్ష జరగగా.. 31,111 మంది విద్యార్థులకు గాను 30,223 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 28,261 మందికి గాను 27,521 మంది హాజరయ్యారు. 2,850 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 2,702 మంది హాజరయ్యారు. శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష ఉంటుంది.

దంచి కొట్టిన వర్షం



ఆరబోసిన మిర్చి పంటలో చేరిన వర్షపు నీరు

అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల వర్షం దంచి కొట్టింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు, సాయంత్రం మరోసారి వర్షం కురిసింది. అనంతపురం జిల్లాలో శింగనమల 28 మి.మీ, గార్లదిన్నె 27, పెద్దవడుగూరు 26, పుట్లూరు 25, పామిడి 24, గుత్తి 23, యల్లనూరు 19, కూడేరు 17, కళ్యాణదుర్గం 13, నార్పల 12 మి.మీ వర్షపాతం నమోదైంది. కంబదూరు, తాడిపత్రి, బుక్కరాయసముద్రం, యాడికి, శెట్టూరు, కుందుర్పి, అనంతపురం, గుంతకల్లు, బెళుగుప్ప, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు తదితర మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఓడీ చెరువులో అత్యధికంగా 58 మి.మీ, ఎన్‌పీ కుంట, గాండ్లపెంట 33, కదిరి 31, అమడగూరు 30, కనగానపల్లి 25, ధర్మవరం 24, రామగిరి 23, మడకశిర 21, నల్లచెరువు 20, ముదిగుబ్బ 18, నల్లమాడ 15, బత్తలపల్లి 14 మి.మీతోపాటు మరికొన్ని మండలాల్లో వర్షం కురిసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంపై ఉత్కంఠ



జేఎన్‌టీయూ(ఏ)లో పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు దృశ్యం

- స్వల్ప ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి
- 9వ రౌండు ముగిసేసరికి 1,413 ఓట్ల మెజారిటీ
- మొదటి ప్రాధాన్యత ఓటులో ఫలితం తేలే అవకాశం లేదన్న అధికారులు
- రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళితే ఫలితాలు నేటి మధ్యాహ్నం తర్వాతే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు ఉత్కంఠగా మారాయి. ఇప్పటివరకూ 9 రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం సాధించాలి. కానీ తొలి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుంది. శుక్రవారం రాత్రి 11.15 గంటలకు 9వ రౌండు ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. ఇప్పటిదాకా వెన్నపూస రవీంద్రారెడ్డికి 84,153 ఓట్లు, టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డికి 82,740 ఓట్లు వచ్చాయి. వెన్నపూస 1,413 ఓట్ల మెజారిటీలో ఉన్నారు. మరో రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం కన్పించలేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళితే ఫలితం శనివారం మధ్యాహ్నం తర్వాత తేలే అవకాశం ఉంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,45,576 ఓట్లు పోలవగా.. ఇప్పటివరకూ 2,16,014 ఓట్లను లెక్కించారు. అందులో 16,976 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మిగతా 1,99,038 ఓట్లను పరిగణనలోకి తీసుకున్నారు.

కలహాల కాపురం..!

- పెళ్లైన ఏడాదికే మనస్పర్థలు
- దంపతుల మధ్య పెరుగుతున్న దూరం
- అనుమానం, అపార్థం, ఆర్థిక వ్యవహారంతోనే అధికం
- పిల్లల నిర్ణయాల వైపే మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులు
- 'దిశ' పోలీస్ స్టేషన్‌కు పెరుగుతున్న అమ్మాయిల ఫిర్యాదులు
- కౌన్సెలింగ్‌తో కాపురం నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

వివాహ బంధం పవిత్రమైనది. ఎంతో బలమైనది. దంపతులు ఒకరికొకరు తోడూనీడగా, అన్యోన్యంగా అరమరికలు లేకుండా జీవిస్తేనే పెళ్లినాటి ప్రమాణాలకు విలువ ఉంటుంది. ఈ తరం అమ్మాయిలు, అబ్బాయిల్లో ఓపిక, సహనం కరువవుతున్నాయి. ఒకరినొకరు అర్థం చేసుకునేది పోయి అపార్థం చేసుకోవడం.. అనుమానాలు పెంచుకోవడంతో కలహాలు పెరిగి కాపురాలు కూలే పరిస్థితులు తలెత్తుతున్నాయి. అనాదిగా వస్తున్న వివాహ వ్యవస్థను అర్థం చేసుకుని మసలుకుంటే అసలు మనస్పర్థలే తలెత్తవని నిపుణులు చెబుతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనుమానాలు పెనుభూతాలై కాపురాల్లో కార్చిచ్చు రేపుతున్నాయి. పెళ్లయ్యి ఏడాది గడవకముందే పోలీస్‌స్టేషన్ మెట్లెక్కే స్థాయికి చేరుతున్నాయి. అన్యోన్యంగా సాగాల్సిన దాంపత్యం అనుమానాలు, అపార్థాలతో నిప్పు ఉప్పులా మారుతోంది. ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఈ ట్రెండు.. భార్యాభర్తల్లోనే కాదు, వారి తల్లిదండ్రుల కుటుంబాలనూ తీవ్ర మానసిక వేదనను మిగిలేలా చేస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంతోమంది అమ్మాయిలు భర్తలతో మనస్పర్థలు వచ్చి 'దిశ' పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. భర్తపై కేసు నమోదు చేయాలనే డిమాండ్‌తో వస్తున్నారు. ఒక్క ఏడాది వ్యవధిలోనే 890 ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి అంచనా వేయచ్చు. అయితే కేసులు నమోదు చేయకుండా కాపురాన్ని నిలబెట్టాలనే ఉద్దేశంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. అంటే వారి మధ్య పూడ్చలేని అగాథం ఏర్పడింది. దీంతో కేవలం 15 శాతం కేసుల్లో మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా రాజీ అయ్యి తిరిగి కాపురాలు చేసుకుంటున్నారు.

పెద్దలూ వంతపాడుతున్నారు..

కాపురంలో చిన్న చిన్న అలకలు సహజం. ఇలాంటివి వచ్చినప్పుడు సర్దిచెప్పాల్సిన పెద్దలూ వంతపాడుతున్నట్టు 'దిశ' పోలీసుల దృష్టికి వచ్చింది. మా కూతురు మంచిదని ఒకరు, మా కొడుకు అంతకంటే మంచివాడని అతని తల్లిదండ్రులు ఎవరికి వారు మద్దతు ఇవ్వడంతో గొడవ గాలివానలా మారుతోంది. వస్తున్న కేసుల్లో ఎక్కువ మంది 25 – 30 ఏళ్ల లోపు వారే. మెజార్టీ జంటలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నట్టు పోలీసుల పరిశీలనలో వెల్లడైంది. సర్దుకుపోయే తత్వం లేకపోవడంతో కలతలు పెరుగుతున్నాయి. ఇందుకు ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, ఆర్థిక వ్యవహారాలు, అనుమానాలు వంటివి ప్రధాన కారణాలుగా విశ్లేషిస్తున్నారు.



2022లో దిశ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు

నెల	ఫిర్యాదులు
జనవరి	59
ఫిబ్రవరి	76
మార్చి	83
ఏప్రిల్	85
మే	99
జూన్	87
జూలై	97
ఆగస్ట్	63
సెప్టెంబర్	59
అక్టోబర్	63
నవంబర్	66
డిసెంబర్	53

(ఇవి కాకుండా ఎస్పీ 'స్పందన'కు 216, స్టేషన్ 'స్పందన'కు 166 ఫిర్యాదులు వచ్చాయి)



దిశ పోలీస్ స్టేషన్

చివరి దశలో తమ వద్దకు

భార్యాభర్తలు చివరి దశలో అంటే అప్పటికే వివాదాలు ముదిరిపోయి విడిపోదామనుకున్న దశలో వస్తున్నారు. కేసు నమోదు కాకుండా వారిద్దరినీ రాజీ కుదిర్చేందుకే యత్నిస్తున్నాం. కొన్ని కేసుల్లో రాజీ కుదురుతోంది. ప్రారంభ దశలోనే ఇలాంటి సమస్యలున్నప్పుడు కౌన్సెలింగ్ ఇచ్చి సరిదిద్దే అవకాశం ఉంటుంది.

–ఎ.శ్రీనివాస్, డీఎస్పీ, దిశ

స్వభావాలు ఏకీకృతం కావడం లేదు

నేనే గొప్ప అన్నది ఇరువురిలోనూ ఉంటోంది. స్వభావాలు, వ్యక్తిత్వాలు కలవడం లేదు. అన్నిటికీ మించి ఉద్యోగరీత్యా కుటుంబానికి ఎక్కువ సమయం దగ్గర కాలేకపోవడం లోపంగా ఉంది. సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా వైవాహిక బంధంలో తీవ్ర ప్రతికూల పరిస్థితి కల్పిస్తోంది.

– డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, నేషనల్ హెల్త్‌మిషన్

చివరి ప్రయాణం

- పోట్లమర్రి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఆరుగురి దుర్మరణం



పోట్లమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం దృశ్యం

బత్తలపల్లి/ధర్మవరం: ఒకరు చికెన్ సెంటర్‌లో పని చేస్తారు.. మరొకరు ఏటీఎం సెక్యూరిటీ గార్డు..ఇంకొకతను గొర్రెల కాపరి. అందరూ రెక్కలకష్టంతో కుటుంబాలను పోషించేవాళ్లే. రోజంతా కష్టపడిన వారంతా సాయంత్రం వేళ తమకై ఎదురుచూసే బిడ్డలను తలుచుకుంటూ ఇంటిదారి పట్టారు. అందరూ కలిసి ఆటోలో పయనమయ్యారు. రేపటి కోసం కలలుగంటూ ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయారు. కానీ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల వారికి అదే చివరి ప్రయాణమయ్యింది. కన్నుమూసి తెరిచేలోగా వారు ప్రయాణిస్తున్న ఆటో బొలేరో వాహనాన్ని ఢీ కొంది. అక్కడే ఐదుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. ఇదే ఘటనలో ధర్మవరానికి చెందిన రంగస్వామి, బొలెరో డ్రైవర్ కుమార్ నరసింహులు, ఐదేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర దుర్ఘటన శుక్రవారం రాత్రి ధర్మవరం–బత్తలపల్లి ప్రధాన రహదారిపై పోట్లమర్రి సమీపాన జరిగింది.







మృతి చెందిన దాసరి ఈశ్వరయ్య, గాలి నారాయణస్వామి, ఆటో డ్రైవర్ నరసింహులు





మృతి చెందిన బత్తల మల్లేసు, హాజీపీరా



గుర్తు తెలియని వ్యక్తి

క్లుప్తంగా

బైక్ ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింకను పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండల పరిధిలోని పాతర్లపల్లి గ్రామ సమీపంలోని పావగడ – పెనుకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం జింకను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు ... పెనుకొండ నుంచి ఫార్మసిస్ట్ ఫక్రోద్దీన్ ద్విచక్ర వాహనంలో రొద్దం వైపు వస్తుండగా పాతర్లపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై జింక ద్విచక్ర వాహనానికి అడ్డుగా రావడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ప్రమాదంలో అక్కడికక్కడే జింక మృతి చెందగా ఫక్రోద్దీన్ తలకు తీవ్ర గాయాలైనట్లు వివరించారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని బెంగళూరు తరలించారన్నారు. మృతి చెందిన జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

ఫలించని చర్చలు

- సమ్మెకు దిగిన తాగునీటి కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జవహార్ కుమార్

కూడేరు: తమ డిమాండ్ల సాధనకై కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ వద్ద ఆ ప్రాజెక్ట్‌లో పని చేసే కార్మికులు శుక్రవారం సమ్మెకు దిగారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జవహర్‌కుమార్ తాగునీటి కార్మికుల వద్దకు వచ్చి సమ్మె విరమించాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు , కార్మికులు మాట్లాడుతూ నవంబర్‌లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు రావాల్సిన బోనస్, లీవ్ ఎంగేజ్మెంట్ గ్రాట్యుటీ ఇవ్వాలని ,పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. లేదంటే సమ్మె విరమించే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. గ్రాట్యుటీ విషయం కలెక్టర్‌తో మాట్లాడి చెబుతానని ఎస్‌ఈ చెప్పినా కార్మికులు మాత్రం సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు తిప్పయ్య, శ్రీనివాసులు, శ్రీరాములు, తిప్పేస్వామితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బకాయిదారులకు భారీ ఊరట

- ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామన్న సర్కారు
- రీజియన్‌లో ఇంటి పన్ను బకాయిలు రూ.250.42 కోట్లు
- ఇందులో ఇంటి పన్ను డిమాండ్ ఒక్కటే రూ.119.23 కోట్లు
- పన్ను పూర్తి చెల్లింపులతో రూ.131.19 కోట్ల మేర వడ్డీ మాఫీ

ఇంటి, ఖాళీ జాగా పన్ను మొండి బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మొండి బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని రెండ్రోజుల క్రితం విడుదల చేసిన జీఓలో పేర్కొంది. దీంతో పన్ను చెల్లింపుదారులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది. కోవిడ్ విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పన్ను చెల్లించకుండా ఇబ్బంది పడ్డ ప్రజానీకానికి జగన్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయం

అనంతపురం క్రైం: మున్సిపల్ రీజినల్ (అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల) పరిధిలో ఐదు నగరపాలక సంస్థలు, 37 మునిసిపాలిటీలున్నాయి. ఈ నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లోని 10,31,768 (10.31 లక్షల హౌస్‌హోల్డ్స్) అసెస్‌మెంట్లకు కొన్నేళ్లుగా బకాయిలు, డిమాండ్ కలుపుకుని రూ.250.42 కోట్లు చెల్లించాల్సి ఉంది. అందులో అసలు రూ.119.23 కోట్లు కాగా, ఆ మొత్తానికి వడ్డీ (పెనాల్టీ) రూ.131.19 కోట్లు ఉంది. ఈ నెలాఖరులోపు బకాయిలు రూ.119.23 కోట్లు చెల్లిస్తే.. రూ.131.19 కోట్ల వడ్డీ మాఫీ అవుతుంది. ఇంత భారీస్థాయిలో ప్రజలకు ప్రభుత్వం మిన హాయింపు కల్పించడం గొప్ప విషయమనే చెప్పాలి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికం..

ఒకేసారి పన్ను మొండి బకాయిలు చెల్లిస్తే అత్యధికంగా వడ్డీ మాఫీ అయిన జిల్లాగా రీజియన్‌లోనే ఉమ్మడి కర్నూలు (కర్నూలు–నంద్యాల) నిలుస్తుంది. ఈ జిల్లాలోని నగరపాలక సంస్థ, 9 మునిసిపాలిటీల్లో 2,86,181 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇంటి పన్ను రూ.36.97 కోట్లు కాగా, వడ్డీ రూ.43.15 కోట్లుగా ఉంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని నగరపాలక సంస్థ, 11 మునిసిపాలిటీల్లో 2,69,743 అసెస్‌మెంట్లకు బకాయి రూ.21.59 కోట్లు కాగా, పెనాల్టీ రూ.23.14 కోట్లుగా ఉంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని నగరపాలక సంస్థ, 9 మునిసిపాలిటీల్లో 2,48,326 అసెస్‌మెంట్లకుగానూ అరియర్ రూ.22.01 కోట్లు, పెనాల్టీ రూ.24.91 కోట్లుగా ఉంది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో మొత్తం 2,27,518 అసెస్‌మెంట్లకుగానూ అరియర్ రూ.39.12 కోట్లు, పెనాల్టీ రూ.39.98 కోట్లుగా ఉంది.

మున్సిపల్ రీజియన్ పరిధిలో ఇంటి పన్ను వివరాలు

జిల్లాలు	అసెస్‌మెంట్లు	బకాయి	వడ్డీ
అనంతపురం, శ్రీసత్యసాయి	2,69,743	రూ.21.13 కోట్లు	రూ.23.14 కోట్లు
వైఎస్సార్ కడప,అన్నమయ్య	2,48,326	రూ.22.01 కోట్లు	రూ.24.91 కోట్లు
తిరుపతి, చిత్తూరు	2,27,518	రూ.39.01కోట్లు	రూ.39.98 కోట్లు
కర్నూలు, నంద్యాల	2,86,181	రూ.36.97 కోట్లు	రూ.43.15 కోట్లు

సద్వినియోగం చేసుకోవాలి



పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసుకునేందుకు మంచి అవకాశం వచ్చింది. కొన్నేళ్లుగా వివిధ కారణాలతో పన్ను చెల్లించని వారు ఈ బృహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల 31 వరకు పన్ను చెల్లించే సదుపాయం ఉంటుంది. వివిధ మునిసిపాలిటీల పరిధిలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసేలా కమిషనర్లు చర్యలు తీసుకున్నారు. పన్ను బకాయిలు చెల్లించి భారీ ఊరట పొందండి.

– పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్‌డీ, అనంతపురం

సీఎం మేలు మరువలేం



పెనాల్టీ లేకుండా ఇంటి పన్ను చెల్లించేలా ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. మాలాంటి వారికి ఇది పెద్ద ఊరట. కోవిడ్ విపత్కర పరిస్థితులతో ఆర్థికంగా ఇబ్బంది ఉండేది. దీంతో పన్ను చెల్లించడం ఆలస్యమైంది. పన్ను చెల్లింపునకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ ఇవ్వడంతో మాకు రూ.88 వేల వరకు ఆదా అయ్యింది. ఈ మొత్తాన్ని మా పిల్లల భవిష్యత్తుకు వాడుకునే అవకాశం కలిగింది. సీఎం వైఎస్ జగన్ సార్ మేలు మరువలేం.

– వరలక్ష్మీ రాజేష్, ఓబుళదేవనగర్, అనంతపురం

గోశాలపై చిరుతల దాడి

- రెండు రోజుల్లో రెండు ఆవుల మృతి



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గోవర్ధనగిరి గోశాలలో ఆవుల మందపై చిరుతలు దాడి చేశాయి. ఈ సంఘటన శుక్రవారం వేకువ జామున చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు... ముదిగల్లు రోడ్డులోని గోవర్ధన గిరి గోశాలలో గత కొన్నేళ్లుగా 150 గోవులను గంగాధర్ అనే వ్యక్తి పోషిస్తున్నారు. అయితే రెండు రోజులుగా సమీపంలోని కొండ ప్రాంతం నుంచి చిరుతలు గోశాలపై దాడికి దిగుతున్నట్లు నిర్వాహకుడు గంగాధర తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ చిరుత అర్ధరాత్రి 2 గంటల సమయంలో గోశాలలోకి చొరబడి ఆవును చంపి తినిందన్నారు. అదేవిధంగా శుక్రవారం వేకువజామున మరో రెండు చిరుతలు ఒకేసారి గోశాలలోకి ప్రవేశించి మరో ఆవును చంపి తిన్నాయన్నారు. రెండు రోజుల్లోనే రెండు ఆవులను చిరుతలు చంపి తినడంతో సుమారు రూ.40 వేలు వరకు నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్, బీట్ ఆఫీసర్ నాగేనాయక్, ప్రొటెక్షన్ వాచర్లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన ఆవుకు వెటర్నరీ సిబ్బందిచే పోస్టుమార్టం నిర్వహించారు. రాత్రి సమయంలో గోశాల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

క్రీడా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 250 మందికి ఈ క్రీడా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. వివిధ క్రీడా విభాగాల నుంచి జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువతీ, యువకులకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తారన్నారు. దరఖాస్తుదారులు భారతీయ పౌరులైన 14 –25 సంవత్సరాల వయస్సు కలిగి ఇతర స్కాలర్‌షిప్, స్టైఫండ్ పొందకుండా ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ లోపు htttp:sportssholarship.ongc.co.inఅనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08554–353223 నంబరును సంప్రదించాలన్నారు.

రేపు గుంటూరులో సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఏపీ సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపికను గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. హర్యానాలో ఈ నెల 23 నుంచి 26 వరకు 69వ జాతీయస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్ జరుగుతుందన్నారు. ఈ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 75 కిలోల బరువు లోపు ఉండి, ఆధార్‌కార్డు, 5 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఎంపికలకు హాజరు కావాలన్నారు.

వ్యక్తిపై దాడి

- రూ.6.60 లక్షల అపహరణ

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి డబ్బు తీసుకొస్తుండగా మొలకాల్మూరు ఫారెస్ట్ పరిధిలో ప్రధాన రహదారిపై నలుగురు దుండగులు దాడి చేసి రూ.6.60 లక్షల అపహరించుకుని వెళ్లిన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. బాధితుని వివరాలమేరకు... పట్టణంలోని ఆస్పత్రి వెనుక నివాసం ఉంటున్న వడ్డే రాజన్న (47) మొలకాల్మూరుకు వెళ్లి రూ.6.60 లక్షలు అప్పు చేసి డబ్బు తీసుకొస్తున్నాడు. రాయదుర్గానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కర్ణాటకలోని మొలకాల్మూరు ఫారెస్ట్ వద్ద నలుగురు దుండగులు అడ్డగించి దాడి చేసి డబ్బు తీసుకొని కర్ణాటక వైపు వెళ్లారు. చికిత్స కోసం రాయదుర్గం ఆస్పత్రికి వచ్చాడు. జరిగిన ఘటనపై బాధితుడు కర్ణాటకలోని మొలకాల్మూరు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా చికిత్స కోసం రాయదుర్గం ఆస్పత్రికి వచ్చాడు. కొట్టిన వ్యక్తులు గుర్తు తెలియదని, పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదని బాధితుడు చెబుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెట్టుపై నుంచి పడి కూలీ మృతి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన మల్లేశు (47) అనే కూలీ కర్ణాటక రాష్ట్రం బళ్లారి సమీపంలో ప్రమాదవశాత్తూ చింత చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల మేరకు ... మల్లేశు గత కొన్ని రోజులుగా చింతచెట్టుపై చింతకాయలను కోసేందుకు దినసరి కూలీగా వెళ్లేవాడన్నారు. శుక్రవారం కూడా బళ్లారి సమీపంలో కూలీ పనుల నిమిత్తం వెళ్లాడని తెలిపారు. చింతచెట్టుపై కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య సన్న తిమ్మక్క, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు, కుమార్తెలకు వివాహమైంది.

కాంక్రీట్ మిల్లర్ చక్రానికి చీర చుట్టుకొని మహిళ మృతి



మృతురాలు కుళ్లాయమ్మ

యాడికి: కాంక్రీట్ మిల్లర్ చక్రానికి చీర చుట్టుకొని మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీకి చెందిన కంబగిరి భార్య కుళ్లాయమ్మ (53) శుక్రవారం మండలంలోని కోనుప్పలపాడుకు తోటి మహిళా కూలీలతో కలసి బేల్దారి పనికి వెళ్లింది. అయితే కాంక్రీట్ కలిపే మిల్లర్ చక్రానికి ప్రమాదవశాత్తూ కుళ్లాయమ్మ చీర చుట్టుకుంది. తీవ్రంగా గాయపడిన కుళ్లాయమ్మను యాడికి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుళ్లాయమ్మ మృతితో ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధుడు...

హిందూపురం: హిందూపురం ప్రభుత్వాస్పత్రి ఎదుట గుర్తుతెలియని వృద్ధుడి శవాన్ని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. శుక్రవారం ఉదయం ప్రభుత్వాస్పత్రి మార్గంలో 70 ఏళ్లు పైబడిన వృద్ధుడి శవాన్ని గుర్తించి అతని ఆచూకీ కోసం పలుచోట్ల విచారించారు. అతనికి ఎవరూ లేరని అనాథ భిక్షగాడిగా కనిపిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్యాకేజీ విధానానికి స్వస్తి

గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఉన్న ప్యాకేజీ విధానానికి స్వస్తి చెప్పి... పనులు, నిధులు నియోజకవర్గాల వారీగానే కేటాయింపు చేసేలా నిర్ణయించింది.

- గ్రామీణ రోడ్ల నిర్మాణాల్లో కొత్త విధానం అమలు
- ఇక నుంచి నియోజకవర్గాల వారీగా పనులు, నిధుల కేటాయింపు
- ఉమ్మడి అనంత జిల్లాలో 93 రోడ్ల నిర్మాణాలకు నిర్ణయం
- వచ్చే నెల 13లోగా ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసేందుకు గడువు



తాడిపత్రి – పుట్లూరు మధ్య వేసిన తారు రోడ్డు

అనంతపురం సిటీ: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా గ్రామీణ రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) యమ్మాని భాగ్యరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రెండు జిల్లాల్లో మొత్తం రూ.109.38 కోట్లతో 93 రోడ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు ఆహ్వానించామని వివరించారు.

పాత పద్ధతికి స్వస్తి

ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్–చైనా) పథకం కింద రెండు నియోజకవర్గాలను కలిపి ఒక ప్యాకేజీ కింద రహదారుల పనులు కేటాయించి, అందుకు తగ్గట్లు నిధులు మంజూరు చేసేవారని ఎస్‌ఈ భాగ్యరాజ్ తెలిపారు. అయితే ఇప్పుడు ఆ పద్ధతికి స్వస్తి చెప్పామన్నారు.

పాత విధానంలో టెండర్లు ఇలా..

హిందూపురం–పెనుకొండ (రెండు నియోజకవర్గాలు కలిపి) ప్యాకేజీ కింద 2019–20లో రూ.77.22 కోట్లతో 56 రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అలాగే మడకశిర – రాయదుర్గం – కళ్యాణదుర్గం ప్యాకేజీ కింద రూ.100.11 కోట్లతో 44 పనులకు అప్పట్లో టెండర్లు పిలిచారు. 250 మంది జనాభా పైబడి ఉన్న గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా తారు లేదా సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. అయితే కొందరు కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయగా, చాలా మంది కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. ఇంకొందరు పనుల్లో పురోగతి చూపించలేకపోయారు. దీంతో ప్రారంభించని రోడ్ల పనులను పూర్తిగా రద్దు చేసినట్లు ఎస్‌ఈ భాగ్యరాజ్ వివరించారు. కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని ఈ విధానానికి స్వస్తి చెప్పినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి నియోజకవర్గాల వారీగా పనులు, నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

ఏకగ్రీవ తీర్మానంతో..

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలతో పాటు స్థాయీ సంఘం సమావేశాల్లోనూ పలుమార్లు సభ్యులు ప్యాకేజీ విధానాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారని ఎస్‌ఈ భాగ్యరాజ్ తెలిపారు. ఇదే అంశానికి సంబంధించి తీర్మానాలు సైతం చేసి ప్రభుత్వానికి పంపారన్నారు. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం విధి విధానాలను మార్పు చేసిందన్నారు.

93 రోడ్లకు టెండర్లు

ప్యాకేజీ విధానానికి స్వస్తి చెప్పిన తర్వాత కొత్త విధానంలో నియోజకవర్గాల వారీగా రోడ్లను మంజూరు చేసినట్లు ఎస్‌ఈ భాగ్యరాజ్ తెలిపారు. రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 93 రోడ్లను మంజూరు చేశామన్నారు. అందుకోసం రూ.109.38 కోట్లు ఖర్చు పెట్టనున్నట్లు వెల్లడించారు.

కొత్త విధానంలో మంజూరైన పనులు, నిధులు ఇలా..

నియోజకవర్గం	పనులు	నిధులు
పెనుకొండ	35	రూ.30.86 కోట్లు
కళ్యాణదుర్గం	26	రూ.44.15 కోట్లు
హిందూపురం	18	రూ.17.88 కోట్లు
మడకశిర	12	రూ.15.44 కోట్లు
రాయదుర్గం	02	రూ. 1.05 కోట్లు
మొత్తం	93	రూ.109.38 కోట్లు

టెండర్లు పిలిచాం



రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఈ నెల 14న ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించాం. వచ్చే నెల 13లోగా ఆసక్తి కలిగి, అర్హులైన కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయవచ్చు. గడువులోగా వచ్చిన టెండర్లకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్లు పిలుస్తాం. ఎవరైతే తక్కువ కోట్ చేస్తారో వారికే పనులు కేటాయిస్తాం. ఈ విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటిస్తాం.

– భాగ్యరాజ్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ, అనంతపురం

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురి డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఏడుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల విభాగం సంచాలకుడు జీవీ రమణ తెలిపారు. అనంతపురం పీవీకేకేలో నలుగురు, కదిరిలో ఇద్దరు, గుత్తిలో ఒకరిని డీబార్ చేసినట్లు వివరించారు.


భారీ వర్షానికి 200 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని చెదుల్ల గ్రామంలో భారీ వర్షానికి 200కు పైగా గొర్రెలు మృతి చెందాయి. బాధితుల వివరాలమేరకు... చెదుల్ల గ్రామానికి చెందిన రామప్ప, రాముపుల్లయ్య, సుధాకర్, నాగరాజు, గిరిరాజులు కలసి గొర్రెలను మేపడానికి కర్నూలు జిల్లా ఆర్లగడ్డ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడే తాత్కాలికంగా నివసంటూ గొర్రెలను మేపేవారు. అయితే గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు 200 పైగా గొర్రెలు మృతి చెందగా మరో 100 వరకు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయని బాధితులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని గొర్రెల కాపరులు విజ్ఞప్తి చేశారు.

ఫీవర్ సర్వేలో ఉరవకొండ టాప్



ఉరవకొండలో ఫీవర్ సర్వే చేస్తున్న ఆశా కార్యకర్తలు, వలంటీర్లు

ఉరవకొండ: ఫీవర్ సర్వేలో జిల్లాలోనే ఉరవకొండ మండలం మొదటి స్థానంలో నిలిచింది. అలాగే పుట్లూరు రెండో స్థానం, తాడిపత్రి మూడోస్థానంలో నిలిచాయి. 38వ స్థానంతో గుత్తి చివరి స్థానంలో ఉంది. ఉరవకొండ పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధితో పాటు రూరల్ పరిధిలోని అన్నీ గ్రామాల్లో వలంటీర్లు, ఆశాలు చురుగ్గా ఇంటింటి సర్వే చేపట్టారు. మండలంలో మొత్తం 25,972 కుటుంబాలు ఉండగా ఇందులో 25,082 ఇండ్లను సందర్శించారు. 96.57 శాతం సర్వేను విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్యశాఖ అధికారి ఉరవకొండ ఎంపీడీఓ చంద్రమౌళితో పాటు ప్రభుత్వ వైద్యాధికారి సాహితిలను ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

సెలవులో కమిషనర్

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి 15 రోజులపాటు సెలవుపై వెళ్లారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భాగ్యలక్ష్మి మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తూ గాయపడిన విషయం విదితమే. కమిషనర్ ఎడమ కాలు ఫ్యాక్చర్ అయ్యింది. 15 రోజుల పాటు ఆమె సెలవుపై వెళ్లారు. కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జ్ టీపీఓ మహబూబ్‌జాన్ కూడా రెండు నెలల పాటు సెలవుపై వెళ్లారు. చైల్డ్ కేర్ సెలవు తీసుకున్నట్లు సమాచారం.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు, గ్రామస్తులు దేవదాయ షరతులకు లోబడి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనొచ్చని తెలిపారు. ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కును దేవస్థాన ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు.

వలీస్వామి ఆశ్రమ నూతన కార్యవర్గం ఎంపిక


నాగేశ్వరరావు


డీఎస్ విజయ్‌కుమార్

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేశారు. ఆశ్రమంలో గౌరవాధ్యక్షుడు చిట్టా శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా డీఎస్ విజయ్‌కుమార్, కోశాధికారిగా పి.కొండారెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ అక్కల్‌కోట్ మహారాజ్ ఆలయాన్ని అవధూత స్వరూపులు వలీస్వామి ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చి శివరాత్రి, దత్తజయంతి, అక్కల్‌కోట్ మహారాజ్ ఆరాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నిత్యం సేవా తత్పరతను అలవర్చారన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాంభూపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌బాబు, జయచంద్రారెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఎంవీఐపై దాడి దారుణం

అనంతపురం సెంట్రల్: విధి నిర్వహణలో ఉన్న కాకినాడ మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావుపై హత్యాయత్నం జరగడం దారుణమని ఉపరవాణా కమిషనర్ శివరాంప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చిన్నారావుపై దాడికి నిరసనగా రవాణాశాఖ కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీటీసీ శివరాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ట్యాక్సు చెల్లించాలని అడిగినందుకు కొబ్బరి బోండాల కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడం దారుణమన్నారు. ఈ దాడిని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరం ముక్తకంఠంతో ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి దాడులు భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐ రమణారెడ్డి, ఏఎంవీఐలు, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కనగానపల్లి: మండలంలో రెండో విడతలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న మొదటి విడతలో 91 శాతం మంది పిల్లలకు ఈ మాత్రలు గుళికలు వేశామన్నారు.

22 నుంచి వసంతి నవరాత్రి ఉత్సవాలు

పామిడి: ఎద్దులపల్లిలోని ఉమా మహేశ్వర సీతారామాంజనేయ ఆలయంలో వసంత నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. ఈనెల 22 నుంచి 29 వరకూ పూజలు నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకూ హనుమాన్ చాలిసా పారాయణం, 30న సీతారామ కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు.

● ఎండల్లో వానహాయ్!

మండే ఎండల్లోనూ వాన కురుస్తుంటే.. ఎండల్లో వానహాయ్..అంటూ చిన్న పిల్లలు పాట పాడుకున్నట్లుంది కదూ.. నిజమే!.. వేసవి ప్రారంభమైంది. ఉదయం పది గంటలు దాటితే చాలు..సూరీడు సుర్రుమంటున్నాడు. ఇంట్లో ఉంటే ఉక్కపోత. బయటకొస్తే భగ భగ మండే ఎండ. ఇంటి నుంచి వీధుల్లో అడుగు వేయాలన్నా జనం జంకుతున్నారు. ఎండకు వాన తోడు అన్నట్లు..మార్చిలోనే మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం తొలకరి జల్లులు పులకరించగా, శుక్రవారం మోస్తరు వర్షం పడింది. దీంతో నగరవాసులు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:











ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

- నగర ప్రజలకు మేయర్ వసీం పిలుపు

అనంతపురం క్రైం: కోవిడ్ సమయంలో ప్రజలు పడిన కష్టాలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం ..ఈ ఏడాది ఇంటి, ఖాళీ స్థలం పన్ను వడ్డీ మాఫీ అవకాశాన్ని కల్పించిందని నగర మేయర్ వసీం తెలిపారు. ఒకేసారి పన్ను చెల్లించి వడ్డీ మాఫీ చేసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లతో కలసి నగరంలోని కమలానగర్, రాజు రోడ్డు, తదితర ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఏళ్ల తరబడి బకాయి ఉన్న వారికి వడ్డీ మాఫీ వరమన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలకు మేలు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ నెలాఖరు(31న)లోపు పన్ను మొత్తం చెల్లించి, నగరాభివృద్ధికి సహరించాలన్నారు. నగరపాలక సంస్థ, పాతూరు, రాంనగర్, రెండో రోడ్డు సచివాలయాల్లో పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఓ సతీష్, ఆర్‌ఐ మురళీ, కార్పొరేటర్లు బాబాఫకృద్దీన్, అనిల్ కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్ పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం కృషి..

ప్రభుత్వం నూతనంగా రూపొందించిన బడ్జెట్‌తో అన్నివర్గాలభ్యున్నతి సాధ్యపడుతుందని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. మైనార్టీ యాక్షన్ ప్రణాళిక పేరుతో భారీగా నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళా సాధికారతకు బడ్జెట్‌లో రూ.77,914 కోట్లు కేటాయించారన్నారు. విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేసి, పేద పిల్లలకు ఉచిత విద్య, కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం మాటలు, అంకెల గారడీ చేసేదని, తమ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన అంశాలతో పాటు ప్రజా అవసరాల దృష్ట్యా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


వడ్డీ మాఫీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నగర మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులు

ఆహారపు అలవాట్లతో రుగ్మతలు

డీఆర్‌డీఏ జీవనోపాధుల డీపీఎం రాధారాణి

రాప్తాడు: మారుతున్న ఆహారపు అలవాట్లతోనే మనిషి అనేక రుగ్మతలకు గురవుతున్నాడని డీఆర్‌డీఏ జీవనోపాధుల డీపీఎం రాధారాణి పేర్కొన్నారు. మండలంలోని గంగలకుంటలో 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా పోతులయ్య గ్రామ సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను రోజువారి ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. చిరుధాన్య పంటలైన జొన్న, సజ్జలు, రాగి, కొర్రలు, సామలు, అరికలు, వరిగలు, ఊదలు, అండు కొర్రలు మానవలి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ చిరుధాన్యాలతో చేసిన పిండి పదార్థాల్లో మాంసపుకృత్తులు, కాల్షియం తదితర అనేక పోషకాలుంటాయన్నారు. మధుమెహం, ఊబకాయంతో బాధపడే వారికి జొన్నలతో తయారు చేసిన ఆహార పదార్థాలు మంచి ఆహారమన్నారు. రాగుల్లో కాల్షియం అధిక స్థాయిలో ఉంటుందన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉన్నతి ఏపీఎం సుభద్ర, జిల్లా ఐటీ యాంకర్ పర్సన్ చంద్ర, ఏపీఎం నీలా రెడ్డి, సీసీ ఉమాదేవి, గ్రామ సంఘాల లీడర్లు, సభ్యులు, వీఓఏ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


గంగలకుంట మహిళలతో ర్యాలీ చేస్తున్న అధికారులు

ఆపద సమయాల్లో తక్షణ సాయమందించండి

రాప్తాడు: ఆపద సమయాల్లో తక్షణ సాయమందించి ప్రమాద బాధితులను కాపాడాల్సిన బాధ్యత మీదేనని శ్రీసత్యసాయి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జీవీ విశ్వనాథ్ పేర్కొన్నారు. పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ సంయుక్తంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని కమ్యూనిటీ లెవల్ వలంటీర్లు, ఆపద మిత్రులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీసత్యసాయి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శిక్షకుడు రాయుడు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు సీసీఆర్ ఎలా చేయాలో డమ్మీ బొమ్మతో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ నిర్మలదాస్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రమేష్, వలంటీర్లు పాల్గొన్నారు.



గుండె జబ్బు వస్తే ప్రథమ చికిత్స ఎలా అందించాలో అవగాహన కల్పిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శిక్షకుడు రాయుడు

సన్‌రే ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని 6వ రోడ్డు సమీపంలో ఉన్న సన్‌రే ఆస్పత్రిలో అవివాహితకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. శుక్రవారం ఆస్పత్రిలో వైద్యులు డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ రాహుల్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుంతకల్లుకు చెందిన అనూష అనే అవివాహిత డయాలసిస్ పేషెంట్. మూడు నెలలుగా డయాలసిస్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఆమెకు ఏవీ ఫిస్టులా పరికరం పనిచేయడం ఆగింది. సన్‌రే ఆస్పత్రి వైద్యులు సురేంద్రబాబు, అమృత, కిరణ్‌కుమార్ నేతృత్వంలో గడ్డ కట్టిన రక్తాన్ని త్రాంబోలైసిస్ (ఇంజెక్షన్) పద్ధతి ద్వారా శుభ్రం చేశారు. ఆమె ప్రస్తుతం ఏవీ ఫిస్టులా పరికరం సహాయంతో డయాలసిస్ చేయించుకుంటోంది. సమస్య వచ్చినప్పుడు ఏవీ ఫిస్టులా పరికరం మరో చేతికి అమర్చాల్సి ఉంటుంది. సమయం కూడా రెండు నెలలు పట్టొచ్చు. ఇలాంటి ఇబ్బంది లేకుండా త్వరితగిన అనంతోనే తక్కువ ఖర్చుతో సన్‌రే వైద్యులు చికిత్స చేస్తున్నారు. సమస్య పరిష్కరించిన సన్‌రే వైద్యులకు బాధితురాలు, ఆమె బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.



యువతికి అరుదైన శస్త్రచికిత్స చేసిన వైద్య బృందం

పి.యాలేరులో వ్యక్తిపై దాడి

ఆత్మకూరు: పి.యాలేరు గ్రామానికి చెందిన తిమ్మరాజుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. పి.యాలేరుకు చెందిన తిమ్మరాజు ఈనెల 15న తన పొలం వద్ద ఉండగా ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి తిమ్మరాజుపై కట్టెలతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న తిమ్మరాజును వదిలేసి వెళ్లారు. కొంతసేపటితర్వాత బాధితుడు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో జరిగిన విషయాన్ని తెలియజేశాడు. వారు అతన్ని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి చేసిన వారిలో ఓ వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం. మిగిలిన నలుగురు కూడేరు మండలం ఎంఎం హళ్లి, అవరకూరు గ్రామాలకు చెందిన వారుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బుక్కరాయసముద్రం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మదర్, చైల్డ్ అధికారి డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు ప్రతి నెలా ఎంత మంది పీహెచ్‌సీకి వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. రక్తహీనత ఉన్నవారు తప్పనిసరిగా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్‌రావు, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, పీహెచ్ఎన్ చెన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలు ఆపండి

అనంతపురం క్రైం: ఖాళీ జాగా పన్ను చెల్లించకుండా అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లింపులకు సంబంధించి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏసీపీలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు ఖాళీ జాగా పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓలు సతీష్‌కుమార్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి, ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీ పాల్గొన్నారు.

రూ.34.50 లక్షలు పన్ను వసూలు..

ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్ను శుక్రవారం రూ.34.50 లక్షలు వసూలైంది. ప్రభుత్వం ఒకే సారి పన్ను చెల్లిస్తే, వడ్డీ మాఫీ అని తెలపడంతో బకాయిదారులు ముందుకొచ్చారు. ఇంటి పన్ను రూ.32 లక్షలు, ఖాళీ జాగా పన్ను రూ.2 లక్షలు, నీటి పన్ను రూ.2.5 లక్షలు వసూలైంది. వడ్డీ మాఫీకి ఈ నెల 31 వరకు గడువు ఉంది.

మాదిగలు ఉద్యమానికి సిద్ధం కావాలి

అనంతపురం టవర్‌క్లాక్: మాదిగలు ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు తిరుపాలు తెలిపారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. తిరుపాలు మాట్లాడుతూ మాదిగలు ఎస్సీ వర్గీకరణకు ఎన్ని ఉద్యమాలు చేసినా ఫలితం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జయప్రకాష్, పెద్దిరాజు, భీమలింగ, చంద్ర, గురుమూర్తి, సునీత, నాగలింగ, నాగరాజు, పాండు, నాజు, రవి, వంశీ, నరేష్, ఫక్కీరప్ప, భూపతి, భానుప్రకాష్, తిప్పేస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీదిరిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నరసింహగౌడ్

రాప్తాడురూరల్: విజయవాడలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో కలిసి గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల సమాఖ్య జిల్లా యూనియన్ ముగ్గురు సభ్యుల (త్రీ మ్యాన్) కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్ శుక్రవారం కలిశారు. కమిటీ చైర్మన్‌గా నరసింహగౌడ్‌కు అవకాశం ఇవ్వడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువాకప్పి బొకే అందజేసి సన్మానించారు. త్రీ మాన్ కమిటీలో చైర్మన్‌గా పసుపుల నరసింహ గౌడ్, సభ్యులుగా ఈశ్వరయ్య, కృష్ణప్ప ఉన్నారు. రాప్తాడు మండలానికి చెందిన పసుపుల నరసింహ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆశీస్సులతో తనను నియమించారన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తానన్నారు.

వాసవీమాతకు కొత్తచీరలతో అలంకరణ


కొత్త చీరల అలంకరణలో అమ్మవారు

అనంతపురం కల్చరల్: ఉగాది పర్వదినాలు రానుండడంతో కొత్తూరు ఆర్యవైశ్య అమ్మవారిశాలలో వాసవీమాతకు కొత్త చీరలతో అలంకరణ, అర్చన పూజలు శుక్రవారం చేశారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు భజనలు, సంకీర్తనలతో అమ్మవారికి భక్తినీరాజనాలర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, వాసవీ మహిళా మండలి అధ్యక్షులు నిర్మలదేవి మాట్లాడారు. శుభకృత్ నామ ఉగాదిని పురస్కరించుకుని ఈసారి ఘనంగా వేడుకలు జరుగుతాయన్నారు.

అంతర పంటల సాగు.. దిగుబడి బాగు

- రబీలో పెరిగిన సాగు విస్తీర్ణం
- తక్కువ వ్యవధిలో రైతులకు ఆదాయం

కనగానపల్లి: దీర్ఘకాలిక పంటలు సాగు చేసి త్వరగా పంట దిగుబడులు పొందలేని రైతులు.. స్వల్పకాలిక పంటల సాగుతో అధిక ఫలసాయం పొందుతున్నారు. ముఖ్యంగా చీనీ, మామిడి వంటి పండ్ల తోటల్లో వేరుశనగ, దోశ, కాయగూరల పంటలు సాగుచేసి, దిగుబడి సాధిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 5 వేల హెక్టర్లలో రైతులు చీనీ, మామిడి వంటి పండ్ల తోటలు సాగు చేశారు. వాటిలో పంట దిగుబడి రావటానికి నాలుగైదేళ్ల కాలం పడుతుంది. దీంతో రైతులు వాటిలో స్వల్పకాలిక పంటలు సాగుచేసి, అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.

రబీలో పెరిగిన అంతర పంటల సాగు విస్తీర్ణం:

ప్రస్తుతం రబీ సీజన్‌లో ఈ అంతర పంటలు సాగు మరింత ఎక్కువగా ఉంది. నియోజక వర్గంలోని కనగానపల్లి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లో రైతులు జాతీయ ఉపాధిహామీ పథకం మెట్ట భూముల్లో రైతులు మామిడి, చీనీ పంటలు ఎక్కువగా సాగు చేశారు. అయితే ప్రస్తుతం సాగునీటి కాలువలతో పాటు, భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వస్తుండటంతో రైతులు తరి పంటల సాగు చేశారు. దీంతో దీర్ఘకాలిక పంటగా ఉండే మామిడి, చీనీ తోటలో రైతులు ప్రస్తుతం వేరుశనగ, దోశ, కలంగర, టమాట, బెండ తదితర ఆరుతడి పంటలను సాగు చేశారు. కనగానపల్లి మండలంలోని తగరకుంట, కోనాపురం, యలకుంట్ల, ముక్తాపురం, ముత్తవకుంట్ల గ్రామాల్లో పలువురు రైతులు ఈ అంతర పంటలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం పంటగా సాగుచేసిన వేరుశనగలో ఎకరానికి రూ.30 వేల దాకా పంట దిగుబడి వచ్చినట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కనగానపల్లి వద్ద చీనీ తోటలో అంతరపంటగా సాగు చేసిన వేరుశనగ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
355	114
57,990	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,650	▼ 66
డోజోన్స్	31,923	▼ 323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▼ 75
డాక్స్	14,768	▼ 199
షాంఘై	3,251	▲ 24
నికాయ్	27,334	▲ 323

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	58,882	▼ 121
బంగారం (22 క్యారట్)	58,646	▼ 120
వెండి (కిలో)	71,576	▼ 523



బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-2-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20-25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15-20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రాపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్ఎస్ 160, ఎన్ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్ఎస్ 200 మోడల్ 18.75 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్ఎస్ 160 మోడల్ 14.6 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.



బిగ్'సి' ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ''ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.



ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.



ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్ధంలో కనిష్టస్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అర శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



రాహుల్

- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



మార్ష్

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1-5, 2-77, 3-129, 4-139, 5-169, 6-174, 7-184, 8-184, 9-188, 10-188. **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, పాండ్యా 5-0-29-1, శార్దుల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1-5, 2-16, 3-16, 4-39, 5-83. **బౌలింగ్:** స్టార్క్ 9.5-0- 49-3, స్టొయినిస్ 7-1-27-2, అబాట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0.



జడేజా

గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి - ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21-14, 18-21, 21-12 స్కోరుతో లీ వెన్ మీ - ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి - ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి - ట్రెసా 6-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6-6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11-8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18-12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి - ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8-1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11-4..13-5..15-8..18-10...ఇలా సాగింది. 20-12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా - లీ సొ హితో గాయత్రి - ట్రెసా తలపడతారు.



జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5-0 స్కోరుతో ఎంవాంగి టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0-5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.



శశి

ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.